## నా హయాంలోనే
# ఖమ్మం నగరాభివృద్ధి

- ఉమ్మడి జిల్లాలో పదికి పది స్థానాలు బీఆర్ఎస్‌వే..
- 'సీతారామ' పనులు పూర్తి చేయిస్తాం..
- రెండు జిల్లాలను సస్యశ్యామలం చేస్తాం..
- నా గెలుపును ఆపడం ఎవరి వల్లా కాదు
- 'నమస్తే' ఇంటర్వ్యూలో ఖమ్మం ఎమ్మెల్యే అభ్యర్థి పువ్వాడ అజయ్



ఖమ్మం, నవంబర్ 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రజలకు ఏం చేశారో చెప్పని నేతలను ప్రజలు నమ్మరని, ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందని బీఆర్ఎస్ ఖమ్మం ఎమ్మెల్యే అభ్యర్థి పువ్వాడ అజయ్ తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన ఉమ్మడి జిల్లాలో నెలకొన్న రాజకీయాలు, గెలుపుపై సాధ్యాసాధ్యాలను గురువారం 'నమస్తే' చిట్ చాట్‌లో పంచుకున్నారు. విజిటింగ్ నేతలకు కాలం చెల్లిందని, కేవలం ఎన్నికల సమయంలో కనిపించే నేతలెవరో ప్రజలు గ్రహించారని స్పష్టం చేశారు. ఖమ్మం నియోజకవర్గం నుంచి తన గెలుపును ఆపడం ఎవరితరం కాదన్నారు. రాజకీయాల్లో విలువలు లేకుండా కొందరు వ్యవహరిస్తున్నారని, ఖమ్మం ప్రజలు వారి ఆటలను ఎట్టి పరిస్థితుల్లో సాగనివ్వరన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో అభివృద్ధి, అహంకారానికి మధ్య ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు నియోజకవర్గం నుంచి ఒక్కరికి కూడా మంత్రి పదవి దక్కలేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటిసారిగా తనకు మంత్రి పదవి ఇచ్చారన్నారు.

### నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఇవీ..

తన హయాంలో గోళ్లపాడు చానల్ ఆధునీకరణ, ఐటీహబ్, ఆర్టీసీ బస్టాండ్, పోలీస్ కమిషనరేట్ పనులు పూర్తి చేశానన్నారు. మున్నేరుకు ఇరువైపులా ఆర్సీసీ వాల్స్, నదిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు తెచ్చానన్నారు. సీతారామ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ప్రాజెక్ట్ పనులు పూర్తయితే ఉభయ జిల్లాల్లోని 10 నియోజకవర్గాలు సస్యశ్యామలవుతాయన్నారు. గోదావరి జలాలను పాలేరుకు తరలించి కృష్ణా, గోదావరి జలాలను అనుసంధానం చేస్తామన్నారు. ప్రజలను ఆకట్టుకోవడానికి ప్రతిపక్ష నేతలు చేస్తున్న పసలేని ప్రసంగాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రెండు జిల్లాల పరిధిలోని పదికి పది నియోజకవర్గాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మూడోసారి ఏర్పడేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయితీరుతారన్నారు.

### బీఆర్ఎస్‌కే ఆదరణ..

నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీ ప్రజలను గందరగోళ పరిచే ప్రయత్నం చేస్తున్నారని, ఉమ్మడి జిల్లాకు కాంగ్రెస్ హయాంలో ఏం మేలు జరిగిందో, ఎవరు అభివృద్ధిని అడ్డుకున్నారో ప్రజలకు క్షుణ్ణంగా తెలుసునన్నారు. ఎన్నికల ప్రచారం ఎవరిది వారు చేసుకోవడంలో అభ్యంతరం లేదని, కానీ ఉభయ జిల్లాలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలు జయప్రదమయ్యాయని, సభలు పార్టీ కార్యకర్తలు, నేతల్లోనూ నూతనోత్సాహం నింపాయన్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కల్వకుంట్ల తారక రామారావు భద్రాద్రి జిల్లాలో నిర్వహించిన రోడ్ షోలకు ప్రజాదరణ లభించిందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పర్యటనలతో బీఆర్ఎస్‌కు పదికి పది సీట్లు సాధిస్తామని ధీమా వచ్చిందన్నారు.

### సాధ్యం కానీ వాగ్దానాలు చేయను..

నియోజకవర్గంలో చేసి అభివృద్ధిని మాత్రమే తాను ప్రచారంలో వివరిస్తున్నానని, సాధ్యం కాని వాగ్దానాలెప్పుడూ తాను చేయలేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా, తన ఇంటి తలుపు తట్టే చనువు నియోజకవర్గ ప్రజలకు ఉందన్నారు. తాను పిలిస్తే పలికే వ్యక్తినన్నారు. ప్రజలు తనను తమ ఇంటి బిడ్డగానే భావిస్తారన్నారు. కరోనా సమయంలో తాను ప్రజలు అందించిన సేవలు వారిని తన వారిని చేశాయన్నారు. కరోనా వంటి సంక్షోభ సమయంలో ప్రజల వెంటే ఉన్నానన్నారు. వారికి వైద్యం అందించేందుకు ఖమ్మం ప్రధానాసుపత్రిని ఆధునీకరించామన్నారు. అవసరానికి తగినంత ఆక్సిజన్ నిల్వలు ఉండేలా చూశానన్నారు.




## అవినీతి ఆరోపణలు నిరూపిస్తే
# నా ఆస్తి ప్రజలకు రాసిస్తా

**నేను ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా**

**మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి చరిత్ర అందరికీ తెలుసు**

**బీఆర్ఎస్ అశ్వారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట, నవంబర్ 23: మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి బుధవారం నాచారం గ్రామంలో తాను దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడ్డానని ఆరోపణలు చేశారని, ఆరోపణలు నిజమని నిరూపిస్తే తన ఆస్తులను ప్రజలకు పంచి ఇస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. దమ్మపేట మండలం తాటిసుబ్బన్నగూడెంలోని తన స్వగృహంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేణుకా చౌదరి తన స్థాయి నుంచి దిగజారి తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్టీ ఎమ్మెల్యేగా తనపై అవినీతి మరకలు అంటించాలని చూస్తే గిరిజనులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తనది ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించే, దూషించే నైజం కాదన్నారు. కానీ రేణుకచౌదరి వ్యాఖ్యలు తనను బాధించాయని, ఈ కారణంతోనే తాను సమావేశం నిర్వహించి స్పష్టత ఇస్తున్నానని ప్రకటించారు. సమావేశంలో జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నాయకులు కోటగిరి పుల్లయ్యబాబు, బేతిని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియ పక్కాగా సాగాలి

## ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

సత్తుపల్లి, నవంబర్ 23 : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పక్కాగా సాగాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వీపీ గౌతమ్ ఆదేశించారు. గురువారం ఆయన సత్తుపల్లి పట్టణ పరిధిలోని జ్యోతి నిలయంలో చేపడుతున్న నియోజకవర్గ ఈవీఎం, వీవీప్యాట్ల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. సిబ్బందికి బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ల కమిషనింగ్‌పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. కమిషనింగ్‌కు హాజరైన వివిధ పార్టీల ప్రతినిధులు, కమిషనింగ్ ప్రక్రియను గమనించాలన్నారు. ఈవీఎం స్ట్రాంగ్ రూం నుంచి కమిషనింగ్ హాల్ వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పీవోలు అడ్రస్ ట్యాగ్ నంబరింగ్ చెక్ చేసుకుని, పేపర్ సీల్డ్ సరి చూసుకోవాలన్నారు. రిజర్వ్ పోలింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. తప్పనిసరిగా రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎన్నికల సాధారణ పరిశీలకుడు సత్యేంద్రసింగ్‌తో కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయ పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించారు. వారి వెంట రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో అశోకచక్రవర్తి, ఏసీపీ రామానుజం, డీఏవో శ్రీనివాసరావు, తహపీల్దార్ యోగేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్ సుజాత ఉన్నారు.



ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ గౌతమ్

## సింగరేణీయులు బీఆర్ఎస్‌ను గెలిపించాలి

### రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

రామవరం, నవంబర్ 23: సింగరేణీయులు బీఆర్ఎస్‌కు అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుకు ఓటు వేసి గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో గురువారం రామవరం టీబీజీకేఎస్ కార్యాలయంలో జీకేవోసీ, ఏరియా వర్క్‌షాప్ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, నాయకులు జేవీఎస్ చౌదరి, కాపు కృష్ణ, కూసన వీరభద్రం, కుమారస్వామి, చిలక రాజయ్య, గౌస్, చెరిపల్లి నాగరాజు, ఎండీ సత్తార్‌పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

## ఖమ్మం మార్కెట్‌కు కొత్త మిర్చి రాక



ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 23: ఖమ్మం నగరంలోని ఏఎంసీకి గురువారం కొత్త మిర్చి తరలివచ్చింది. ఉదయం ఏఎంసీ చైర్‌పర్సన్ శ్వేత, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు జీవై నరేష్, ఖరీదుదారులు, కమిషన్ వ్యాపారులు సంప్రదాయ పద్ధతిలో పూజలు చేసి కొనుగోళ్లను ప్రారంభించారు. అనంతరం జరిగిన జెండా పాటలో సాధారణ మిర్చి క్వింటాలుకు గరిష్ఠ ధర రూ.19 వేలు, మధ్య ధర రూ.18వేలు, కనిష్ఠ ధర రూ13,500 పలికింది. ఏసీ రకం మిర్చికి క్వింటాలుకు గరిష్ఠ ధర రూ.24,200, మధ్య ధర రూ.22,400, కనిష్ఠ ధర రూ.19 వేల చొప్పున పలికింది. యార్డుకు కొత్త మిర్చి 182 బస్తాలు, ఏసీ రకం 2,604 బస్తాలు వచ్చాయని మార్కెట్ కమిటీ సెక్రటరీ రుద్రాక్ష మల్లేశం తెలిపారు. రైతులు తీసుకొచ్చిన పంటకు ఏఎంసీ మద్దతు ధర ఇచ్చేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు.

## గంజాయి పట్టివేత

కొత్తగూడెం క్రైం, నవంబర్ 23: ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం వేరు వేరుగా దాడులు నిర్వహించారు. దాడుల్లో 4.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ గురువారం సిబ్బందితో బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. మహబూబాబాద్‌కి చెందిన ఇటికాల రాఖేశ్ అనే వ్యక్తి వద్ద ఉన్న బ్యాగును సోదా చేసి 1.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే సహాయక ఆబ్కారి అధికారి కరమ్‌చంద్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ చెన్నా నాగేశ్వరరావు సిబ్బందితో కలిసి బస్టాండ్ దాడులు నిర్వహించారు. మహబూబాబాద్‌కి చెందిన శ్రీరామ్ నాయక్, నరేష్ అనే ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.

## అత్త ఆత్మహత్య కేసులో కోడలికి ఐదేళ్ల జైలు

ఖమ్మం లీగల్, నవంబర్ 23: అత్త ఆత్మహత్యకు పురిగొల్పిందని కోడలిపై నేరం రుజువు కావడంతో ఖమ్మం అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె.ఆశారాణి గురువారం నిందితురాలికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.వేలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నేలకొండపల్లి మండలం పైనంపల్లికి చెందిన గోసుల వీరబాబు 2012లో విమల అనే మహిళను ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులు వీరి వైవాహిక జీవితం బాగానే కొనసాగింది. తర్వాత వీరబాబు తల్లి అంజమ్మకు విమల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. విమల తన అత్తను తరచూ దూషించేది. మానసికంగా బాధపెట్టేది. దీంతో అంజమ్మ 3 డిసెంబర్ 2016న కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నది. తల్లి మృతిపై వీరబాబు నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితురాలిపై కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు కేసు పూర్వపరాలను పరిశీలించి నేరం రుజువైందని నిర్ధారించి న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎండీ ఇర్షాద్ వ్యవహరించగా ఆయనకు లైజన్ ఆఫీసర్ ఎల్.భద్రూనాయక్, హోంగార్డు శ్రీనివాసరావు సహకరించారు.

## ఆస్తి వివాదంలో అన్నావదినపై దాడి

వైరా రూరల్, నవంబర్ 23: ఆస్తి విషయమై సోదరుడు తన అన్నావదినపై దాడి చేసిన ఘటన విప్పలమడక గ్రామంలో చోటు చేసుకున్నది. తెలిసిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోదరులు వాకదాని బాబూరావు, శ్రీనివాసరావు అన్నాదమ్ములు. ఇద్దరివీ పక్క పక్కన ఇళ్లు. రెండు కుటుంబాల మధ్యకొంత కాలం నుంచి ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై ఇరువర్గాల మధ్య పెద్దమనుషులు చొరవ తీసుకుని అనేక పంచాయితీలు పెట్టారు. అయినా సమస్య కొనసాగుతూనే ఉంది. ఈక్రమంలో గురువారం బాబూరావు, అతని భార్య నాగమణి ఇంటి ముందు పనిచేసుకుంటుండగా శ్రీనివాసరావు వారి వద్దకు వెళ్లాడు. అన్నావదినలపై దాడి చేసి గాయపరిచాడు. క్షతగాత్రులు బాబూరావు, నాగమణిని స్థానికులు ఓ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. బాబూరావు సోదరుడిపై వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.